# సర్వకర్మలు భగవంతుని ప్రీతికోసమే చేయండి

మృత్పిండమేకం బహుభాండరూపం
సువర్ణమేకం బహు భూషణాని
గోక్షీరమేకం బహుధేను జాతి
ఏకం పరాత్మా బహుదా హవర్తి

ప్రేమ స్వరూపులారా!

మట్టి ఒక్కటైనప్పటికిని కుండలు అనేకము. సువర్ణము ఒక్కటైనప్పటికిని నగలు వివిధముగా ఉంటాయి. పాలు ఒక్కటే అయినప్పటికి గోవులు అనేకముగా ఉంటాయి. దేవుడు ఒక్కడే అయినప్పటికిని వివిధ రూపములతో గోచరిస్తూ ఉంటాడు. ఏకం సత్ విప్రాబహుధావదంతి. ఉన్నటి ఒక్కటే అయినప్పటికి దానిని అనేక రూపములుగా మానవుడు దర్శిస్తున్నాడు. సహస్రశీర్షా పురుషః సహస్రాక్ష సహస్ర పాత్ అనగా అన్ని శిరస్సులు అన్ని నేత్రములు, అన్ని పాదములు అతనివే. ఏకోవసి సర్వ భూతాంతరాత్మ. అందరియందు ఉండినటువంటి దైవత్వము ఒక్కటే. కనుక విశ్వం విరాట్ స్వరూపం. విశ్వం విష్ణుమయం. కనుక ప్రతి మానవుడు దైవస్వరూపుడే.

నీటి యందెపుట్టి నీటిపై తేలుచు
నీటి యందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు

దివ్యత్వము ప్రతి మానవునియందు అవ్యక్తముగా ఉంటున్నది. విశాలమైన సముద్రములో అసంఖ్యాకములైన అలలు బయలుదేరుతూ ఉంటాయి. అనేక విధములైన రూపములు

sri sathyasai vachanamrutam

ధరిస్తూ ఉంటాయి. అయితే అన్ని అలలు సముద్రమునకు వేరుకావు. సముద్రము యొక్క అంశములే అలలు. అదేవిధముగా ఈ విశ్వమునందు ఆవిర్భవించే ప్రతి మానవుడు సచ్చిదానంద స్వరూపమునుండి ఆవిర్భవించిన స్వరూపములే. మమైవాంశో అందరూ నా అంశమేగాని ఒక పంచభూత అంశములుగాని లేక ప్రపంచ అంశముగాని కాదు. అని బోధిస్తూ వచ్చింది. భగవంతుడు ప్రేమ స్వరూపుడు. కనుక మానవుడు కూడను అట్టి ప్రేమాంశమే.

కానీ అట్టి ప్రేమను మానవుడు ప్రపంచములో కొంత వరకును అందించలేకపోతున్నాడు. దీనికి కారణము స్వార్థము స్వప్రయోజనమే. ఈనాడు భౌతికముగా, వైజ్ఞానికముగా మానవజాతి అనేక విధములుగా అభివృద్ధి గాంచినది. కాని నైతికముగా, ధార్మికముగా దినదినమునకు దిగజారిపోతున్నది. ఏపని చేసినా స్వార్థమే వెనుక కదలుతూ ఉంటుంది. ఏమి తలంచినా, ఏమి విన్నా ఏమి పలికినా అన్నింటికి వెనుక స్వార్థమే కదలుతూ ఉంటున్నది. కనుక ఇట్టి స్వార్థమును మనము నిర్మూలము చేసినప్పుడే పరార్థము మనకు లభ్యమవుతుంది. కనుక మన సేవలయందు దివ్యత్వము ఆవిర్భవింపచేసుకొని సర్వమానవులయందు దైవత్వము ఉన్నదని విశ్వసించి తద్వారా మనము సేవలు చెయ్యాలి. ఈనాటి మానవునియందు త్యాగముపైన అభిరుచి గానీ భోగముపైన అయిష్టముగాని కావటం లేదు. మనము త్యాగేనైకే అమృతత్వమానశుః అని సర్వ విధముల కొంత వరకు త్యాగముచేసి జగత్తుకు సేవలు చెయ్యాలి. మొట్టమొదట త్యాగమును తల్లిదండ్రులతో ప్రారంభించాలి. తల్లి తండ్రి గురువు దైవము ఈ మాటలు వరుసగా వచ్చేపదములు. ప్రతి ఒక్కరినోటా మనము వింటున్నాము. ఈ వరుస క్రమమునకు ఉండిన అంతరార్థమును మనము గుర్తించలేకపోతున్నాము. తండ్రి తల్లి గురువు అని చెప్పవచ్చుకదా. కానీ తల్లి తండ్రి గురువు దైవము ఈనాల్గింటి యొక్క క్రమమునకు అంతరార్థము లేకపోలేదు. దీని యొక్క అంతరార్థము ఏమిటి?

మనము పుట్టిన తక్షణమే మనకంటికి కనుపించేది, మనము లాలించి, పాలించి అన్ని విధములా పోషించేది తల్లి. తండ్రి ఎవరో తెలుసుకునే జ్ఞానము మనకు ఉండును. తండ్రి

sri sathyasai vachanamrutam

ఎవరో తెలుసుకునే బుద్ధి కూడను మనకు ఉండదు. అట్టి అజ్ఞానస్థితిలో తల్లియే తండ్రిని చూపుతుంది. ఈ తండ్రి పెంచి పెద్దచేసి విద్యావంతుని గావించే నిమిత్తమై సద్గురువును చూపుతాడు. ఆ గురువు దైవమును చూపుతాడు. తల్లి తండ్రిని చూపుతుంది. తండ్రి గురువును చూపుతాడు. గురువు దైవమును చూపుతాడు. అదేవిధముగనే భక్తి జ్ఞాన వైరాగ్య తత్త్వములనే ఈ నాల్గింటి ద్వారానే మనకు ముక్తి లభిస్తుందని వేదాంతము యొక్క గాధ. ముక్తి అనే దానికి ఈ నాలుగు సోపానములు. భక్తి, ఈ భక్తి అనేది క్రమక్రమేణా పెరుగుతూ అదే జ్ఞానరూపము ధరిస్తుంది. ఈ జ్ఞానమే వైరాగ్యము నందిస్తుంది. ఈ వైరాగ్యమే తత్త్వమును తెలుపుతుంది. ఈ తత్త్వమువలనే మనకు ముక్తి లభిస్తుంది. దీనికీ భాగవతమును పెద్ద ఆదర్శముగా తీసుకున్నారు. భాగవతమనే పదమునకు ఐదు అక్షరములు. భా-గ-వ-త-ము. భా అనగా భక్తి. గ అనగా జ్ఞానము. వ అనగా వైరాగ్యము. త అనగా తత్త్వము. ఈ నాల్గింటి స్వరూపమే ముక్తి. కనుకనే భాగవతమనేది మనం బాగవుతాం అనే అంతరార్థము నిరూపిస్తుంది.

### ఎక్కడ చూసినా దైవమే ఉండేది

దైవము సర్వత్ర ఉంటున్నాడు. ఎక్కడ చూసినా దైవమే ఉండేది దీనినే వేదాంతమునందు అయ్యా నీవు భగవంతుని చూడాలి చూడాలి అని ఆశిస్తున్నావు. నీవు చూస్తున్నదంతా భగవంతుడే కదా! ఈ స్వరూపాలన్నీ భగవత్ స్వరూపాలే. అయితే మానవుని యొక్క దృష్టి బహిర్ముఖముగా ప్రసరించటంచేత అంతర్ముఖమైన ఆత్మతత్త్వమును అర్థము చేసుకొనలేకపోతున్నాడు. ఈ మానవుడు శాంతి నిమిత్తమై పోరాటము సలుపుతున్నాడు. తన ఆనందము తన శాంతి తనయందే ఉండి కూడను కేవలము ఎండమావులను చూసి భ్రమించినట్లుగా మానవుడు బహిర్ముఖమైన ప్రయాణము సలుపుతున్నాడు. నిర్విరామ కృషిచే నిరంతర తాపత్రయములచే అంతులేని ఆశలచే మానవుని అశాంతికి గుర్తై కేవలము నిరాశ నిస్పృహలతో కూలిపోతున్నాడు. మొట్టమొదట శాంతిని మనలో మనము అభివృద్ధి గావించుకోవాలి. మనశాంతిని మన ఇంటి లోపల ప్రసరింపచెయ్యాలి. మన ఇంటి నుంచి మన గ్రామములో ఈ శాంతిని పంచటానికి ప్రయత్నించాలి. ఈ విధముగా వ్యక్తియందు

sri sathyasai vachanamrutam

శాంతిని మనము అభివృద్ధి గావించుకొని తదుపరి కుటుంబము నందు, తదుపరి సమాజమునందు అభివృద్ధి చెయ్యాలి.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహమాత్మ నివేదనమ్**

ఈ దాస్యమనేది చాలా పవిత్రమైనది. ఈ సేవాతత్త్వమునందు మన జీవితమును సార్థకము చేసుకోవాలి. ఆకార మానవునివల్ల లోకమునకు ఏమాత్రము సుఖము నందించలేము. ఆచార విచారమానవునిగా మనము రూపొందాలి.

ఈనాడు మన సంస్థలయందు సత్యము ధర్మము శాంతి, ప్రేమ, అహింస అనే పదములను ప్రచారము చేస్తున్నాము. ప్రదర్శిస్తున్నాము. కానీ ఆచరించటము లేదు. ప్రదర్శన చేత మనయొక్క ప్రశాంతిని అభివృద్ధి గావించుకోలేము. దర్శించాలి సత్యమును. భారతీయ పవిత్రమైన శాస్త్రము దీనికి ప్రధానమైన మూలము సత్యధర్మములే. సత్యంవద ధర్మంచర అని ఈ రెండింటికి ప్రాధాన్యత ఇచ్చింది. కనుక మనము ఈ సత్యధర్మములను సరైన మార్గమునందు నడుపుకొనలేకుండిన మానవత్వమే నిరర్థకమైపోతుంది. సత్యవ్రతముతో మనయొక్క జీవితమును సార్థకము గావించుకోవాలి.

ఈ సత్యమునకు రెండు రూపములుంటున్నవి. ఒకటి ఋతం అని రెండవది సత్యం అని. ఋతం అనేది మానసిక సత్యం. ఈ సత్యమనేది లౌకికమైన వాక్సత్యం. ఈ మానవతా విలువలు మనము అభివృద్ధి గావించుకొనవలెనన్న అష్టాంగ యోగముల లోపల మొట్టమొదటిది యమ. యమ నియమ ఆసన ప్రాణామాయ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధి ఈ అష్టాంగములలోపల యమము చాలా ప్రధానమైనది. యమము అనగా ఏమిటి? అహింస మొదటిది. రెండవది సత్యం. మూడవది ఆస్తేయము. నాల్గవది బ్రహ్మచర్యము. అసంగము చిట్టచివరిది.

అహింస అనగా ఏమిటి? ఒక ప్రాణిని మనము హింసించకుండా ఉండటమే కాదు. శారీర మానసిక వాక్కుతో కూడను ఎవరిని హింసించకూడదు. కనుక త్రికరణ శుద్ధితో ఆచరించేదే అహింస. ఇంక సత్యము త్రికాలబాధ్యం సత్యం. ఈ సత్యము ఏనాటికి

srisathyasaivachanamrutam

మరువరాదు. Truth is one not two. సత్యము అనేది చూచినది చూచినట్టుగా చెప్పింది చెప్పినట్టు చేసింది చేసినట్లు చెప్పటం మాత్రమే కాదు సత్యము. ఇలాంటి సత్యస్వరూపమైన జగత్తునందు సత్యమును మనము ప్రచారము చెయ్యాలి. అన్నింటియందు ప్రేమ చాలా అత్యవసరము. ఈ ప్రేమ తత్త్వము మనము పెంచుకుంటే సర్వము కూడను అందులో మిళితమై పోతాయి. ప్రతిసాధనయందు ప్రేమ ప్రధానమైన ప్రాణము. ఈ ప్రేమతత్త్వమును మనము పెంచుకోలేకపోతే మనుష్యత్వమునకు ప్రయోజనములేదు. ఆ ప్రేమనే దైవము. అందువల్లనే Love is God, live in love, start the day with love, spend the day with love, till the day with looe, end the day with love. ఈ ప్రేమతత్త్వము మనము అభివృద్ధిగావించుకోవాలి. ఈ అహంకార రహితమైన సేవలలో మనం పాల్గొనాలి. దైవత్వమును మరచటంచేత దీనత్వములో మనము మునిగిపోతున్నాము. దైవత్వమును మనము ఏనాడు విస్మరించకుండా ఉంటామో అప్పుడే మన జీవితము సుఖశాంతులను పొందుతుంది.

మానవ దేహమునకు ఏది కారణము? కర్మయే కారణము. ఈ కర్మకు ఏది కారణము? కేవలము భావమే కారణము. ఈ భావమునకేది కారణము? శీలము కారణము. ఈ శీలమునకేది కారణము? అదే ప్రాప్తి అదే అదృష్టము. కనుక మన అదృష్టము మంచిదిగా ఉండాలంటే గుణము మంచిదిగా ఉండాలి. ఈ గుణము మంచిదిగా ఉండాలంటే భావము మంచిదిగా ఉండాలి. భావము పరిశుద్ధముగా ఉండాలంటే కర్మలు పరిశుద్ధమైనవిగా చేయాలి. కర్మ పరిశుద్ధము కావాలంటే సంకల్పము సక్రమమైనదిగా ఉండాలి. కనుక సంకల్పమే అన్నింటికిని మూలాధారము. జగత్తంతయు సంకల్పముతోనే నిండి ఉంటున్నది. మనోమూల మిదం జగత్. సర్వము మనోమయమే. ఇది ఏమిటి? (చేతిరుమాలు చూపిస్తూ) ఒక వస్త్రము. కానీ ఇది వస్త్రముకాదు. దారములయొక్క చేరిక. దారములు కాదు ప్రత్తి. ప్రత్తి లేక దారము లేదు. దారము లేక వస్త్రము కాలేదు. మూడు చేరి ఒక్కటే. అదేవిధముగనే సంకల్పములయొక్క దీనిచేత కోరికలనే దారము తయారౌతున్నది. ఈ కోరికలనే దారము చేత మైండ్ అనే వస్త్రము తయారౌతున్నది. కనుక ఈ కోరికల యొక్క సమ్మిళితమైన స్వరూపమే మనస్సు. ఇప్పుడు ఈ వస్త్రము మనకు ఉండకూడదనుకుంటే ఒక్కొక్కదారము

srisathyasaivachanamrutam

తీసివేస్తే వస్త్రములేదు. అదే విధముగా కోరికలు మనము అదుపులో పెట్టుకుంటే మనస్సే ఉండదు.

చాలామంది మీ మద్రాసు వారికందరికి తెలుసు. రైల్వేవారు వేస్తూ ఉంటారు. Less luggage more comfort make travel a pleasure. ఈ కోరికలనేవి పెద్ద బరువైన లగేజి. కనుక మనకోరికలు చాలా వరకు తగ్గించుకోవాలి. మితి మీరిన కోరికలలో మనము ప్రవేశించి మతిని చెడుపుకుంటున్నాము. మనకు ఎంత ప్రాప్తియో అంత తృప్తి పడాలి. తృప్తిలేని వానికి శాంతి ఉండదు. శాంతి లేనివానికి సుఖము ఉండదు. అందువలనే అసంతృప్తి ద్విజోనష్టః అన్నారు. అసంతృప్తి వలన రెండు నష్టములు ఉంటున్నాయి. ఒకటి అశాంతి ఒకటి అసంతృప్తి. కనుక మనము తృప్తితో ఉండాలి.

దీనికోసమే మనిషి మూడు రకములైన ఇచ్ఛాశక్తితో ఉన్నాడు. ఒకటి స్వేచ్ఛ. రెండవది పరేచ్ఛ. మూడవది అనిశ్చ. ఈ మూడింటి అంతరార్థము ఏమిటి? స్వేచ్ఛ అనగా మనము ఇష్టము వచ్చినట్లు బజార్లు చుట్టడం, ఇష్టము వచ్చినట్లు పనులు చేసుకోటం ఎవరు ఏమనటానికి వీలులేదని మనము ఒకవిధమైన కండబలము గుండె బలముతో వారితో పోట్లాడటం ఇది మాత్రం స్వేచ్ఛకాదు. మనస్ఫూర్తిగా సంకల్పించుకొని ఒక కార్యము మనము సాధించినప్పుడు ఆ కార్యము నుండి వచ్చిన సుఖదుఃఖములు మనస్ఫూర్తిగా మనమే అనుభవించాలి. ఇదే స్వేచ్ఛ. మనము కార్యము చేయటములో ఎంత స్వేచ్ఛ ఉందో ఆ కార్యఫలమైన సుఖ దుఃఖములు అనుభవించేదాంట్లో కూడ అంతే స్వేచ్ఛను మనము అనుభవించాలి. పరేచ్ఛ అనగా ఇతరులయొక్క ప్రోద్బలముచేతగాని లేక ప్రోత్సాహముచేతగాని ఒక కర్మలో మనము ప్రవేశించి తద్వారా జరిగిన సుఖదుఃఖములకు అయ్యోవారిని అనుసరించటము వలననేను ఈ గతి పట్టితినని ఇతరులను నిందించేటువంటిది పరేచ్ఛ. మూడవది అనిచ్ఛ. తాను కోరక పరుల ప్రోద్బలమును ఏమాత్రము అనుసరించక దైవికముగా జరిగిన సుఖదుఃఖములను తాను అనుభవించటము ఇది అనిచ్ఛ.

**మానవుడు అజ్ఞాని కాదు**

sri sathyasaivacharamrutam

మానవుడు ఎవరు అని మొట్టమొదట మనము అర్థము చేసుకోవాలి. మానవుడు అజ్ఞాని కాదు. వాడు కేవలము ఒక లోభికాదు. పాపికాదు. అతను మహాజ్ఞాని. మానవ అనే పదమునందే అర్థము ఇమిడి ఉంటున్నది. మా అజ్ఞానము. న లేకుండా వ వర్తించటము. అజ్ఞానము లేకుండా వర్తించేవాడు మానవుడని. కనుక దుర్లభమే మానుషోదేహః. దుర్లభమైన మనుష్య జన్మమునకు ప్రాప్తించింది. అలాంటి జన్మకు తగిన సార్థకము మనము సాధించాలి. రూపమునకు నామమునకు తగిన క్రియలలో మనము పాల్గొనాలి. ఒకానొక సమయము లోపల భోజరాజు ఆస్థానములో ఒక సన్యాసి వేషములో వచ్చి ప్రవేశించాడు ఒక వ్యక్తి. ఆనాడు ఆ సన్యాసి పవిత్రమైన వేదాంత ప్రబోధలు సలిపాడు. రాజు అతని ప్రబోధలను మెచ్చుకొని వరహాలు ఉన్న తట్టను అతనికి అందించాడు. అప్పుడు ఆ సన్యాసి చెప్పాడు 'ఇది నేను స్వీకరించను. సర్వసంగ పరిత్యాగియైన సన్యాసికి కాసుతో పనియేమి కనుక ఇది నాకు అక్కరలేదు' అన్నాడు. రెండవ దినము అదే వ్యక్తి నర్తకి వేషము ధరించి ఆస్థానములో ప్రవేశించింది. ఆమె నృత్యము బాగా చేసింది. సరే ఆమెకు కూడను కొంతబహుమానంగా కొన్ని వరహాలు ఇచ్చాడు. ఆమె చెప్పింది ఈ కొంచెము వరహాలు తృప్తికాలేదు ఇంకను కొంచెం ఇవ్వాలనింది. అప్పుడు సన్యాసి వేషముతో వచ్చిన వ్యక్తే నర్తకి వేషముతో వచ్చాడని గుర్తించాడు. అమ్మ నిన్నటి దినము ఎన్ని కాసులు ఇచ్చినా నాకు వద్దన్నావు. ఈనాడు కొంచెం కాసులు నాకు చాలదంటున్నావు దీనిలో ఉన్న అంతరార్థము ఏమిటి? అన్నాడు. వేషమునకు తగిన వ్యవహారమే లేకపోతే మన సౌభాగ్యము మనభారతీయ సంస్కృతి నంత కూడను మంటగలిపిన వారమవుతాము. కేవలము దీనిని భ్రష్టుపట్టించిన వారమవుతాము. నా నిన్నటి దినము వేషము సన్యాసము. పేరు సన్యాసి. ఈనాటి వేషము నర్తకి. దీనికి తగిన వేషము ధరించాను. ఆ వేషమునకు తగినట్టుగా ప్రవర్తించాను నిన్నటి దినము. ఈనాటి వేషమునకు తగినట్టుగా ప్రవర్తిస్తున్నాను నేడు అని చెప్పటంచేత భోజుడు చెప్పాడు భేష్ ఇలాంటి ప్రబోధలు నాకు నచ్చాయి. నేను రాజును. రాజుకు తగినట్టుగా నేను ప్రవర్తించాలిగాని రాజు కేవలము ఒక దుర్మార్గములో ప్రవేశించటము మంచిదికాదు. ఈ బోధన నిమిత్తమై చేసినావని ఆమెను మెచ్చుకున్నాడు.

వేషము కాషాయవస్త్రము ధరించవచ్చు. కానీ హృదయము అంతా కసాయమే.

sri sathyasai vachanamrutam

సంసారికి లేని ఆశలు వానికి ఉంటుంటాయి. మన భారతీయ సంస్కృతి నిర్మూలమై పోతున్నది. ఇంక పండితుడనుకుంటే వేదశాస్త్ర ఇతిహాస పురాణములంతా చక్కగా కంఠస్థము చేసి ఉండవచ్చు. మంచి రుద్రాక్ష మాల దండిగా వేయవచ్చు. ఆ వేషమునకు, ఆ పదమునకు తగిన ప్రవర్తన వారిలో ఉంటుండదు. పండితః సమదర్శన సమత్వమనేది వానిలో శూన్యమైనది. వానిలో శూన్యమైనప్పుడు తాను పండితుడెట్లా అవుతాడు. త్యాగి అనే సన్యాసము లోపల వానికి ఆశలు ఉంటే వాడు సన్యాసి ఎట్లా అవుతాడు. కానీ ఈనాటి మానవులందరు వేదాంత ప్రబోధలు చేసేవారు అంతా భోగరాజులు. యోగరాజులుగా తయారౌతున్నారుగానీ త్యాగరాజులుగా తయారుకావటం లేదు.

**సేవ చేసి తరించండి**

కనుక మనము ఈనాడు సత్యసాయి సేవాదళ్ సేవకు తగిన ప్రవర్తనను మనము చెయ్యాలి. మనము సేవకులము. ఎవరికి చేసినా ఇది దైవమునకు చేస్తున్నాననే భావన పెట్టుకోవాలి. వానరుడైన హనుమంతుడు ఎంతపవిత్రమైన భావముతో రాముల సేవచేశాడు. కేవలము వానరుడంటే మీరు తెలివితక్కువ వాడని మీరు భావించరాదు. శాంతుడు గుణవంతుడు బలవంతుడు హనుమంతుడు. అలాంటి హనుమంతుడు అశోకవనములో చెట్టుపై నుండగా రాక్షసులు అంతా ప్రశ్నించారు. కోతీ నీవు ఎక్కడినుండి వచ్చావు? ఎవరు నీవు అని ప్రశ్నించారు. అప్పుడు చెప్తున్నాడు హనుమంతుడు. దాసోహం కోసలేంద్రస్య. నేను రామ చంద్రుని యొక్క దాసుడను అన్నాడు. నే గొప్పవాడను బలవంతుడను హనుమంతుడను అని చెప్పలేదు గర్వించి. నేను దాసుడను, రామదాసుడను అని చెప్పుకున్నాడు. కనుక నే కింకరులు కాక శంకరులు కారు. మనము సేవకులము కాకుండా నాయకులము కాము.

ఈనాటి నాయకులంతా సేవకులు కాకుండా పోవటం చేతనే వినాయకులుగా తయారౌతున్నారు. సేవలో మన జీవితమును తీర్చిదిద్దుకోవాలి. ఈ సేవలో అహంకారమునకు గాని స్వార్థమునకు గాని, స్వప్రయోజనమునకుగాని ఏమాత్రము మనస్సును ఇవ్వకూడదు. ఎవరికి చేసినా భగవంతునికి చేస్తున్నాను అనే భావము

sri sathyasai vachanamrutam

హృదయములో పెట్టుకొని చేయాలి. అప్పుడే మానవసేవ మాధవసేవగా మారుతుంది. అట్లు కాకుండా నేను సేవాదళము వాడిని నేను సేవ చేస్తున్నానంటే ఇది ప్రదర్శనమైపోతుంది. అహంకారము నిర్మూలము కావాలి. ఈ అహంకారము కేవలము అవివేకముతో కూడి ఉంటుంది. ఈ అవివేకము, అజ్ఞానము నుంచి వస్తున్నది. ఈ అజ్ఞానమనేది వట్టి భ్రమనే. ఇలాంటి దీనిలో అవివేకమును పూర్తి దూరము చెయ్యాలి. ఎవరైనా ఏమైనా అనుకొనే నేను సేవ చెయ్యాలి ఇది నా ప్రధానమైన కర్తవ్యమనే లక్ష్యమును నిలుపుకోవాలి.

ప్రేమస్వరూపులారా! మనము సమాజములో పుట్టాము. సమాజములో పెరుగుతున్నాము. సమాజములో జీవిస్తున్నాము. సమాజములోనే మన కీర్తి గౌరవములు పెంచుకుంటున్నాము. సమాజములోనే మన విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నాము. సమాజములోనే జ్ఞానజ్ఞానములో ప్రవేశిస్తున్నాము. సమాజముతోనే మన జీవితమును గడుపుకుంటున్నాము. ఈ సమాజముతో మనము ఇన్ని అందుకున్నప్పుడు మనము సమాజమునకు ప్రతిఫలముగా సేవ చేయనక్కరలేదా! కనుక కృతజ్ఞత రూపకముగా సేవ చెయ్యాలి. సమాజము లేకపోతే మన జీవితమే లేదు. కనుకనే ఈ సమాజమునకు కృతజ్ఞత రూపకముగా మనము సేవ చెయ్యాలి. కనుక భగవంతుడిచ్చిన శరీరమును ధర్మాన్ని అనుసరించే కోసమని, ఆచరించే కోసమని ఈ పవిత్రమైన జన్మము లభించింది. కనుకనే ప్రహ్లాదుడు చెప్పాడు.

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరునొవ్వంగ హరికీర్తినుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా దలపడేని**
**గలుగనేటికి తల్లుల కడుపు చేటు**

అంతేకాదు తన తోటి వారందరికి సేవ తత్త్వములో చక్కగా బోధిస్తూ నాయనా ఏది సత్యము, ఏది నిత్యము అనే దానిని మీరు విచారించాలి అన్నాడు. భగవంతుడు ఒక్కడే సత్యము. ఈ జగత్తంతా మిథ్యయే. సత్యమైన ఆత్మతత్త్వమునందే మిథ్యయైన ఆత్మతత్త్వము నిల్చి ఉంటుండాది. ఇదే అక్షరం అని. ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ. అక్షరమనగా కేవలము

sri sathyasai vachanamrutam

శాశ్వతమైనదని మనము అనుకుంటున్నాము. కాదు శాశ్వతము, అశాశ్వతము రెండు చేరి ఉంటున్నవి. ఆ ఆత్మతత్త్వము. ఆ అమృతత్త్వము. అ అనేది అనృతత్త్వముకాదు. అ అన్నది అమృతత్త్వము. కాని క్షర అనేది మృత తత్త్వము. ఇది అనిత్యమైనది. అది జీవతత్త్వము. అక్షర క్షరమయ్యేది అమృతత్త్వము కూడినది కనుక అక్కడ జీవ బ్రహ్మైక్యాను సంధానముగా ఉంటున్నది. జీవము క్షరమైనది. దైవము అక్షరమైనది. ఈ రెండింటి యందు ఉండిన ప్రేమతత్త్వము భక్తి ఒక్కటియే. ఈ ప్రేమచేత అన్ని పనులు మనము ఆచరించాలి.

శంకరాచార్యులు సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అన్నారు. అయితే జ్ఞానమే బ్రహ్మ అని బోధించాడు ఆనందలహరిలో కేవలము అన్నింటిని బోధించుకుంటూ భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే. అద్వైత సిద్ధాంతములో కూడను ఈ యొక్క భక్తిలోపల మరల ప్రవేశించాడు. భగవంతుని భజించండి. భగవంతుని స్మరించండి. సర్వకర్మలు ఆచరించండి. అన్ని కర్మలు మనము భగవత్ప్రీతికరముగా ఆచరించాలి. అప్పుడే అవి కర్మలు కాకుండా సేవలుగా మారుతాయి. కనుక మనము చేసే సేవలు అన్నీ కూడను మన ఇంటిలో ఏవిధమైన భావముతో చేసుకుంటామో బయట వారిని కూడను ఆవిధమైన భావముతో చెయ్యాలి. కాని ఈనాటి మానవుడు అందరు తనను గౌరవించాలని ఆశిస్తున్నాడేగాని తాను ఇతరులను గౌరవించటానికి ప్రయత్నించటం లేదు. ఎన్ని సిద్ధాంతములు తెలుసుకున్నా, ఎన్ని భౌతిక భోగములు అనుభవించినా, ఎంత వైజ్ఞానిక పరిశీలన చేసినా కానీ మానవతా విలువలు ఎన్ని నీవు సంపాదించుకున్నావు అన్నదే ప్రశ్న.

మానవతా విలువలు లేకపోతే ఇంక మానవుడెట్లా అవుతాడు చెప్పండి. ఎన్ని సంపాదించినప్పటికి మానవతా విలువలు మనలో ఏకపోతే వాడు మనిషే కాదు. కనుక మానవత్వమనగా మనసు, మాట, క్రియ అన్నీ ఒక్కటిగానే అతికి యుండాలి. మనసు వేరైన మాటలు వేరైన క్రియ మరొకటైన ఇది ఏమాత్రము విలువ ఉంటుండదు. ఈ మూడింటి యొక్క ఏకత్వమే ఆనందమును అందిస్తుంది. Fan చూడండి, ఈ fan కు మూడు బ్లేడులు ఉన్నాయి. మూడు బ్లేడులు మూడు వైపులకు చూస్తుంటే మనకు గాలి ఉండదు. మూడు ఒక్కరౌండుగా చుట్టినప్పుడే మనకు గాలి వస్తుంది. కనుక మన హృదయమనే దీంట్లో

srisathyasaivachanamrutam

సత్యరజోతమోగుణములు మూడు గుణములు. ఒక ధ్యాను ఈ మూడింటి యొక్క ఏకత్వమును చేసినప్పుడే అదేమనకు ఆనందము.

## ఏ పనిచేసినా దైవకార్యముగా భావించండి

ప్రేమస్వరూపులారా! కేవలము మీరు భజన చేయుటమని గాని లేక ధ్యానము చేయటమని గాని, జపము చేయటమనిగాని చేయవచ్చును. కానీ నా ఉద్దేశ్యములో కాలము వ్యర్థము చేయటమే. ధ్యానములో కూర్చుంటారు. ఒక్క సెకండైనను మనసు నిల్వరు. ఎక్కడెక్కడికో పోతూ ఉంటుంది ఈ మనసంతా. ఇలాంటి మనసును నిల్పుకోకుండా కూర్చుండటం వలన టైము ఎంత వృధా అవుతుంది. నీ ఇంటిపనులు నీవు చేసుకో. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు. ఏది చేసినా దైవసేవగా మనము భావించాలి. ఆడవారికి కూడను పని లేకపోతే మాటలు ఎక్కువగా ఉంటాయి. ఏపని చేసినా మనము దైవసేవగా భావించాలి. ఒక సత్సంగము జరుగుతూ ఉంటుంది. ఆ సత్సంగమునకు పోవటానికి మనకు అవకాశము ఉండి ఉండదు. అలాంటి సమయములో మన ఇంటి పనులు చేసుకుంటున్నాము. అయ్యో! ఈ పనిలో నేను మునిగిపోతినే నేను సత్సంగములో చేరకపోతినే అని మనసులో బాధపడనక్కరలేదు. నీ పిల్లలను, నీ పతిని సరైన రీతిలో చూసుకుంటే అదే నిజమైన సేవ. ఇల్లుగెల్చి రచ్చగెలవమన్నారు. మన ఇంటిలోపల సరైన దీనిని సాధిస్తే కదా మనము బయట దేనినైనా సాధించవచ్చు. ఇల్లును నీవు ఊడుస్తూ ఉన్నావనుకో. ఇల్లు ఊడుస్తున్నాననే భావము నీవు మరచిపోయి హృదయాన్ని పరిశుద్ధము చేస్తున్నాననుకో. ఒక చపాతీనో పూరీనో చేస్తున్నావనుకో. అప్పుడు నా హృదయాన్ని విశాలము చేస్తున్నాను అనుకో ఎంత బాగుంటుంది. కూరగాయలు తరిగి సాంబారు చేస్తున్నావనుకో. ఈ కూరగాయలు నా కామక్రోధ మద మాత్సర్యములు అనే దుర్గుణములు జ్ఞానమనే ఖడ్గముతో త్రుంచి ప్రేమ అనే జలముతో ఉడికిస్తున్నాను అనుకో. ఈ విధముగా ప్రతి పనియందు భగవద్భావాన్ని ఎంతవరకు అంకితము గావించవచ్చో చెప్పండి.

సర్వకర్మ భగవత్ప్రీత్యార్థం. పరనిందలు మాత్రం చేయకండి. ఎవ్వరిని మనము నిందించకూడదు. కారణమేమన అందరియందు భగవంతుడే ఉన్నాడు. మన దృష్టి

srisathyasaivachanamrutam

అంతయు బాహ్యమైన దీంట్లో ప్రసరించటము చేత మనస్సు మాలిన్యమై పోతున్నది. ఆ మాలిన్యమైన జలము లోపల భగవంతుని సుందర వదనార విందము సుస్పష్టముగా కనుపించదు. అది పరిశుద్ధము. గావించుకున్నప్పుడే భగవంతుని ప్రతిబింబము తప్పక కనుపిస్తుంది. చిత్తస్యశుద్ధియే కర్మః మనము చేసే కర్మలు మన చిత్తశుద్ధిని కలిగిస్తున్నాయి. ఈ కర్మలలో మనం ప్రవేశించకుండా పోతే మన చిత్తము మాలిన్యమైపోతుంది. కనుక మనము చేసే ప్రతి కర్మకూడను చిత్తశుద్ధి లక్ష్యముతో చెయ్యాలి. ప్రతి ఫలమును మనము అపేక్షించకుండా ఉండాలి. ఇలాంటి దీంట్లో మనము భగవద్భావాన్ని ఇముడ్చుకున్నప్పుడు జీవితము సార్థకమవుతుంది.

మన మనస్సు పరిశుద్ధము కావాలంటే మూడు కార్యములు మనము చెయ్యాలి. దీనినే త్రికరణశుద్ధి అన్నారు. అసత్యముతో దూషితముకాని వాక్కు, హింసాదులచే దూషితము కాని కర్మ, రాగ ద్వేషములతో దూషితము గాని మనస్సు ఈ మూడింటి యొక్క పరిశుద్ధి దీనినే త్రికరణ శుద్ధి అన్నారు. త్రికరణ శుద్ధిని గావించేదే యమం. అట్లు లేకుండా నిరంతరము ఏదో ఒక లోక సమాచారము లోపల మనము మునిగి మన మనస్సును మాలిన్యము చేసుకోవటం ఇది మనిషి కర్తవ్యము కాదు. ఈనాటి మానవత్వమును చక్కగా పవిత్రము గావించే నిమిత్తమై మన జీవితము అంకితము గావించాలి. దేహము శాశ్వతము కాదు. ఉన్నంత లోపల మనము తగిన సత్కర్మలు ఆచరించాలి. శరీర నిర్మాణమునందే కాకుండా మేధాశక్తియందు కూడను మానవుడు అన్ని ప్రాణులకంటె ఉత్తముడుగా ఉంటున్నాడు. కానీ దీనికి ఆయుఃప్రమాణము చాలా తక్కువ. కనుక ఈ ఆయువు ఉండినప్పుడే మన తెలివి తేటలను, మన శరీరముయొక్క శక్తిని సద్వినియోగము చేసుకోవాలి. ఆ నిమిత్తమై మానవత్వము మనకు ప్రాప్తించినదని భావించాలి. కేవలము తినటము, త్రాగటము, నిద్రించటము ఇంత మాత్రమే కాదు జీవితము. దీనిని సేవయందు సార్థకము చేసుకోవాలి. సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. అందరికి మనము నమస్కారము చెయ్యాలి. దేహములు అపవిత్రమైనవిగా ఉండవచ్చును. కానీ లోపలి ఆత్మ ఒక్కటే. ఆ భావముతో మనము అందరిని గౌరవించాలి.

srisathyasaivachanamrutam

**వినయంతో సేవ చేయండి**

సేవలు చేసేవారికి వినయము అత్యవసరము. మంచి మాటలచేత వారిని సంతృప్తి పరచాలి. అప్పుడే మానసికమైన విశాలత అభివృద్ధి అవుతుంది. విశాలము గావించుకోవాలి. ఎంతకాలమైనా కూడను సంకుచితము సంకుచితము ఈ విధముగా చేస్తుంటే ఏనాటికి మనము పూర్ణత్వమయేది. పూర్ణత్వము కావాలి. సంవత్సరములు జరిగిపోతున్నాయి. కానీ మనలో పూర్ణత్వము తరిగిపోతున్నది. విశాలత పెంచుకోవాలి. తాను తనకుటుంబము అనే స్థానమునుండి సమాజము అనే దీంట్లో ప్రవేశించాలి. కానీ దురదృష్టవశాత్తు ఈనాటి మానవునకు అన్నమయము, ప్రాణమయము, మనోమయము, విజ్ఞానమయము, ఆనందమయమనే ఐదు కోశములుంటున్నాయి అయితే అన్నమయము దేహము, ప్రాణమయము వరకే పోతున్నాడు ప్రయాణము. ఏదో కొంతమంది మాత్రం మనోమయము వరకు వెడుతున్నారు. విజ్ఞానమయములో ఎవ్వరూ ప్రవేశించటం లేదు. ఇంక ఆనందము మనకు ఏరీతిగా ప్రాప్తిస్తుంది. విజ్ఞానమనగా ఏమిటి? నిత్యానిత్య విషయ పరిశీలనలో మనము ప్రవేశించాలి. దేహము పాంచభౌతికము. ఇలాంటి దేహములో ఉండిన దేహిని మనము కనిపెట్టాలి.

**ప్రేమ స్వరూపులారా!**

> **మలినపు కొంప రోగముల ప్రుగ్గడు సేవకగంప జాతసం**
> **చలనము పొందుదుంప భవసాగరమీదగలేని కంప అం**
> **బుల పొదిలెమ్ముచూడ మనమెచ్చుదలంపగ దేహమింక ని**
> **శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే.**

మానవత్వము లోపల ఇట్టి దివ్యత్వము ఉండటం చేతనే మనము పవిత్రమైన కాలమును సద్వినియోగం చెయ్యాలి. సేవచాలా అవసరమైనది. ఈనాడు సేవకులనే పేరుతో మనము ప్రవర్తిస్తున్నాముగానీ సరిగా సేవ చేయటం లేదు. ఈనాడు అధికారమునకు ముందుకు వస్తున్నారు. ఆచరణకు వెనుక వెళుతున్నారు. పదవులకు ముందు వస్తున్నారు. పనులకు దూరమైపోతున్నారు. తిండికి తయార్ పనికి పరార్. పనికి తయారుగా ఉండాలి. తిండికి

sri sathyasai vahini

పరార్‌గా ఉండాలి. పదవులు మనకు అక్కరలేదు. మనకు పని కావాలి. కనుక ఈనాటి పనిలో ప్రవేశించినప్పుడు పదవి తనంత తానే వరిస్తుంది. రెండు చక్కగా మనము దృష్టిలో పెట్టుకోవాలి. Rights అని మనము fight చేస్తున్నాము. What about responsibility. Right and responsiblility రెండు రెండు నేత్రములు. రెండు చక్రములు, రెండు రెక్కలు, ఇందులో ఏది లేకపోయినాగాని ఎరగలేము, నడవలేము. మన బాధ్యతను సరిగా నిర్వర్తిస్తే రైట్ దానంతట అదే మనకు లభిస్తుంది. కనుక మనము కర్తవ్యమును నిర్వర్తించాలి. అదే నిజమైన యోగము. ఒకరు చూసినా చూడకపోయినా నీ మనసుకు నీకు తృప్తి కలగాలి. నీ మనస్సే నీకు సాక్షిగా నిల్వాలి. తమిళంలో చెప్తుంటారు.

**మనస్సుకు మనము సాక్షి**
**దేహమునకు గుణము సాక్షి**
**సర్వమునకు స్వామి సాక్షి.**

కనుక మన మనస్సే మనకు సాక్షిగా ఉండాలి. మన మనస్సుకు చక్కగా చేశామనే తృప్తి కలగాలి. అదే satisfaction. ఆ self satisfaction రావాలనుకుంటే self confidence ఉండాలి. మొదట self confidence వలనే selfsatisfaction వస్తుంది. Self satisfaction వలనే self sacrifice వస్తుంది. Self satisfice వలనే self realisation వస్తుంది. Self satisfaction లేదు. Confidence లేదు sacrifice లేదు. Realisation ఎట్లా చిక్కుతుంది. మనకు ఈ కలి ప్రభావములో కాసు ఖర్చుకాకూడదు. నడుము వంచి పని చేయకూడదు. కాలు గడప దాటకూడదు కైవల్యము వుట్టి ఒళ్ళో పడాలి. ఇంత సోమరులు. ఇది కేవలము సోమరత్వము. సోమరత్వమును మనము దూరం చేస్తే సోహం తత్త్వము మనకు ప్రాప్తిస్తుంది. కనుక మనము సోమరత్వమును దూరము చెయ్యాలి. దేహము ఉండినంతవరకు శ్రమించి పనిచెయ్యాలి. కర్మయందే మనకు అధికారము ఉంటున్నాది. మన అధికారము అంతా కర్మనే. నిస్వార్థకత నిమిత్తము సేవలు చెయ్యాలని భావించాలి. ఇలాంటి పవిత్రమైన ప్రేమనే, పవిత్రమైన కర్మలచే జీవితాన్ని సార్థకం గావించుకుంటారని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ఎన్ని సేవలు

sri sathyasai vachanamrutam

చేస్తున్నా నామస్మరణ చేత కాలమును సార్థకము చేసుకోండి. భజన చేసుకుంటూ భగవన్నామాన్ని స్మరించుకుంటూ పనులు చేస్తూ రావచ్చు. శ్రమయే కనుపించదు మనకు.

**(తేది. 23-03-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam